ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు

5

సోమవారం 10 నవంబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

డోన్ ప్రజల కల నెరవేరేనా?



పరిపాలన సౌలభ్యం కోసం వైసీపీ ప్రభుత్వం జిల్లా పునర్విభజన చేపట్టింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో లాభం ఏమో కానీ డోన్ నియోజకవర్గ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నో ఏళ్లుగా కర్నూలు జిల్లాతో ఉన్న అనుబంధాన్ని కోల్పోయింది. డోన్ నుంచి నంద్యాల వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలు సైతం ఇష్టపడటం లేదు. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం.. గంటల తరబడి ప్రయాణం చేయాల్సి రావడం.. దీంతో తమను ఎలాగైనా కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని వేడుకుంటున్నారు. ఎన్నికల వేళ కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి సైతం హామీ ఇచ్చారు. డోన్, ప్యాపిలి మండలాలను కర్నూలులోనే కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆయన అధిష్ఠానం దృష్టికి సైతం ఈవిషయాన్ని తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబు కూడా సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.

- నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్
- ఎమ్మెల్యే కోట్ల తీవ్ర ప్రయత్నాలు
- డోన్ నుంచి నంద్యాలకు వెళ్లాలంటే నరకయాతనే
- ప్రజలకు శాపంగా మారిన గత ప్రభుత్వ నిర్ణయం

డోన్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డోన్, ప్యాపిలి మండలాలను కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కృషిచేస్తున్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీని అమలుచేస్తే కోట్ల కుటుంబంపై నియోజకవర్గ ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగే అవకాశముంది. విలీన ప్రక్రియను నెరవేర్చేందుకు ఎమ్మెల్యే కోట్ల అధిష్ఠానం వద్ద గట్టిగానే కృషిచేస్తున్నట్లు తెలిసింది.

50 కిలోమీటర్ల దూరంలో ఉన్నా..

50కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలుకు వెళ్లేందుకు హైవే కూడా ఉంది. డోన్ నుంచి కర్నూలుకు ఒక గంట ప్రయాణం. డోన్ నుంచి నంద్యాలకు 80కిలోమీటర్లు ప్రయాణ కష్టాలతో ఇబ్బందులు పడాల్సిందే. డోన్ నుంచి బస్సులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డోన్ నుంచి నంద్యాలకు వెళ్లాలంటే 3గంటలకు పైగానే ప్రయాణం. నంద్యాలకు వెళ్లాలంటే డోన్, ప్యాపిలి మండలాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క రైతుల ఇబ్బందులు, నంద్యాల కలెక్టరేట్‌కు వెళ్లాలన్నా ప్రజలు, ఉద్యోగుల తిప్పలు వర్ణనాతీతం.

అడ్డగోలుగా విభజన

డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల, ప్యాపిలి, డోన్ మండలాలు ఉన్నాయి. మొత్తంగా నియోజకవర్గలో 2లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో డోన్ పట్టణం, మండలంలోని ఓటర్లు 80వేలకు పైగా ఉన్నారు. గతంలో కర్నూలు జిల్లాలోనే డోన్ నియోజకవర్గం కొనసాగుతూ వచ్చింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022లో ఏప్రిల్‌లో డోన్ నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా నంద్యాల జిల్లాలో విలీనం చేశారు. కర్నూలు జిల్లాకు ఉన్న అనుబంధాన్ని డోన్ నియోజకవర్గం కోల్పోయింది. ప్రజలకు కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. అడ్డగోలుగా విభజించడంతో వైసీపీ ప్రభుత్వంపై డోన్, ప్యాపిలి మండలాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో మాజీ మంత్రి బుగ్గన ఓటమి చవి చూడడానికి కారణం ఇదేనని పలువురు మేధావులు, సంఘాల నాయకులు చర్చించుకుంటున్నాయి. పరిపాలనా, ప్రజల సౌలభ్యం కోసమైనా నంద్యాల నుంచి కర్నూలులో కలపాలని, డోన్, ప్యాపిలి మండలాల ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

రవాణా ఖర్చులు ఎక్కువయ్యాయి



ఏ చిన్నసమస్య వచ్చినా నంద్యాలకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో రవాణా ఖర్చులు పెరిగాయి. చిన్న వ్యాపారాలు చేసుకునే వారం. నంద్యాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. కర్నూలు జిల్లాలోనే డోన్, ప్యాపిలి మండలాలను కొనసాగించాలి.

- వెంకట సుబ్బమ్మ, పూల వ్యాపారి, డోన్

ఏ చిన్నసమస్య వచ్చినా..



ఏ చిన్నసమస్య వచ్చినా, మీటింగుల కోసం నంద్యాలకు వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. నంద్యాలకు వెళ్లాలంటే ఒక్కరోజంతా సమయం పడుతుంది. కలెక్టరేట్ స్పందనకు అర్జీలు ఇవ్వడానికి దాదాపు 90 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. రవాణా సౌకర్యాలు కూడా సక్రమంగా లేవు.

- ఎస్.అబ్దుల్ రెహమాన్, ఆవాజ్ కమిటీ కార్యదర్శి, డోన్



సీఎం దృష్టికి తీసుకెళ్లా



ప్రజల సౌలభ్యం కోసం డోన్, ప్యాపిలి మండలాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగేందుకు కృషి చేస్తున్నాం. ఈవిషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు సత్యనారాయణ ప్రసాద్, నాదెండ్ల మనోహర్, బీసీ జనార్దన్‌రెడ్డి, అనిత, నిమ్మల రామనాయుడు దృష్టికి తీసుకెళ్లాను. సానుకూలంగా స్పందించారు.

- కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, డోన్

జాతీయ జెండాతో స్కేటింగ్ క్రీడాకారుల ర్యాలీ

- నగరంలో 'వందేమాతరం' గేయాన్ని ఆలపిస్తూ..



కర్నూలు నగరంలో స్కేటింగ్ ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయాన్ని ఆలపిస్తూ కర్నూలులో స్కేటింగ్ క్రీడాకారులు ఆదివారం ఉదయం స్కేటింగ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాష్ట్ర రోలర్ స్కేటింగ్ ఆదేశాలతో కర్నూలు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను చేతపట్టి కర్నూలు డీఎస్‌ఏ స్టేడియం నుంచి ఈర్యాలీ కొండారెడ్డి బురుజు వరకు కొనసాగింది. ర్యాలీలో పలు పాఠశాలల స్కేటింగ్ క్రీడాకారులు, జిల్లా స్కేటింగ్ సంఘం కార్యదర్శి అబుబకర్, జిల్లా స్కేటింగ్ సంఘం సీఈవో పి.సునీల్‌కుమార్, స్కేటింగ్ సంఘం సభ్యులు శిరీష్‌బాబు, వీరేష్, నారాయణ, హనుమంతు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



కల్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని విద్యుత్ సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశాఖ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. డిస్కం పరిధిలోని కర్నూలు నంద్యాల, శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య, వైఎస్సార్ కడప, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లా వినియోగదారుల నుంచి సమస్యలు తెలుసుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వినియోగదారులు 8977716661 నెంబరుకు ఫోన్ చేసి, 9133331912 నెంబరుకు చాట్ చేయడం ద్వారా సమస్యలు తెలపాలన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పైన తెలిపిన మొబైల్ నెంబర్లకు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

వన రక్షకులు భద్రమేనా?

- అటవీ శాఖను వేధిస్తున్న ఆయుధాల కొరత
- ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పరిస్థితి మరీ దారుణం
- నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

7

జీజీహెచ్‌లో ఆగని దొంగతనాలు

ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవం

కర్నూలు లీగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని లోక్ అదాలత్ భవనంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి ఆదేశాల మేరకు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు 1987లో మన దేశంలో 1995 సంవత్సరం నవంబరు 9వ తేదీన అమలులోకి వచ్చిందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని తెలిపారు. రాజ్యాంగంలోని 39ఏ అధికరణం ప్రకారం ఆర్థిక, సామాజిక వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల వారికి ఉచిత న్యాయ సహాయం అందించడంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ సమన్వయంతో మహిళలకు, పిల్లలకు ఉచిత న్యాయ సహాయం అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో అనూరాధ, ప్యానెల్ అడ్వకేట్లు, ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్

ప్రభుత్వ పనితీరు బాగుంది

- ట్రైనీ ఐఏఎస్‌ల కితాబు



వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు

మద్దికెర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరు బాగుందని ట్రైనీ ఐఏఎస్‌లు అంకిత్ రాజ్‌పుత్, మోహిత్ మంగల్, భరత్‌దత్ తివారి, తన్మయి మెగ్వాల్ అమర్ బాగిల్ అతుల్ సోనీ కితాబు ఇచ్చారు. నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద ఎంపికైన మద్దికెరలో ఆదివారం వారు పర్యటించారు. కస్తూర్బా పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలు, కూరగాయాల మార్కెట్‌ను ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్ రాష్ట్రాల నుంచి వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామం లోని ప్రభుత్వ పథకాలను, ప్రభుత్వ పనితీరు, వ్యవస్థపై అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా పాఠశాలలో మౌలిక వసతులపై విద్యార్థినులతో ఆరాతీశారు. కూరగాయల వ్యాపారం ఎలా జరుగుతుందని, ధరలు ఎలా ఉన్నాయని, ప్రభుత్వం సౌకర్యాల కల్పించిందా అని వ్యాపారులను ప్రశ్నించారు. లైబ్రరీ, గ్రామ సచివాలయాలు పరిశీలించారు. ఈనెల 12వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. తహసీల్దార్ గూండాల్‌నాయక్, ఎంపీడీవో కొండయ్య, ఏపీవో నర్సిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం పరిశీలన

హొళగుంద: స్థానిక పీహెచ్‌సీని ట్రైనీ ఐఏఎస్‌లు ఆదివారం పరిశీలించారు. డ్యూటీ డాక్టర్లు భరత్, బిందుమాధవితో మాట్లాడారు. ఎంపీడీవో విజయలలితతో వారు సమావేశమై తాగునీటి పథకాలు, రోడ్లు, పాఠశాలలతో పాటు ఆర్ఐ మహేశ్‌ను రెవెన్యూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏబీపీ కోఆర్డినేటర్ రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్



కర్నూలులో చంద్రరాజేశ్వరరావు భవన్‌కు చేరుకున్న ఏఐఎస్ఎఫ్ బస్సు జాతా

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్‌జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల ప్రారంభమైన బస్సు జాతా ఆదివారం కర్నూలు చేరుకుంది. బస్సు జాతాకు ఏఐఎస్ఎఫ్ నాయకులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఆఫీస్ బేరర్ మస్తాన్, ఫణీంద్ర, చలపతి, నాగభూషణం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా, జిల్లా కార్యదర్శి శరత్ కుమార్, నగర కార్యదర్శి అశోక్, మధు పాల్గొన్నారు.

రేపు ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన

- పలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించనున్న చంద్రబాబు
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాజెక్టులకు మంగళవారం ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని, తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్డీవోలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పరిశ్రమల శాఖ అధికారి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్, టూరిజం అధికారి తదితరులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ముఖ్యమంత్రి జిల్లాలో ఏపీఐఐసీ, ఎయిర్‌పోర్టు, పర్యాటకానికి సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ ఆదోని ఆర్డీవో అజయ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఆరుద్ర పూజలు

- వైభవంగా స్వర్ణ రథోత్సవం, పల్లకీ సేవ
- స్వామి, అమ్మవార్లను అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు ఆరుద్ర నక్షత్ర పూజలు, స్వర్ణ రథోత్సవం, పల్లకీ సేవను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చనలు చేసిన తరువాత భక్తులకు దర్శనాలు తీర్థప్రసాదాలు కల్పించారు. అనంతరం గంగాధర మండపం రథశాల వద్ద స్వర్ణరథంపై ఆశీనులై ఉన్న స్వామి, అమ్మవార్లకు షోడశోపచార పూజా క్రతువులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, శ్రీనివాసరావు, అధికారులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన వీధిలో భక్తులు కార్తీక దీపాలు వెలిగిస్తూ రద్దీ ఎక్కువగా ఉండడంతో గ్రామోత్సవం నిర్వహించలేదని అధికారులు తెలిపారు. కళాకారులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ స్వామి, అమ్మవార్లకు నృత్య నివేదన చేశారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో పుష్పాలంకరణ చేసిన పల్లకిపై ఆదిదంపతులను ఆశీనులచేసి వార పూజల చేశారు. అనంతరం ఆలయ ప్రదక్షిణగా పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు.



స్వర్ణ రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో, చైర్మన్



స్వామి, అమ్మవార్లకు నమస్కరిస్తున్న భక్తులు

శివ నామస్మరణతో మార్మోగిన శ్రీగిరి క్షేత్రం

పరమశివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్ర పర్వదినం సందర్భంగా ఆదివారం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్ల ద్వారా ఉభయ దేవాలయాల్లో అలంకార దర్శనం కల్పించారు. ఉచిత దర్శనానికి కంపార్ట్‌మెంట్‌లో వేచి ఉండే భక్తులకు 5 నుంచి 6గంటల సమయం పట్టగా, శీఘ్ర, అతిశీఘ్ర టిక్కెట్ దర్శనాలకు రెండు గంటలు, వీఐపీ బ్రేక్ టికెట్లు పొందినవారికి గంట సమయం పట్టిందని ఆలయాధికారులు చెప్పారు. 50వేల మంది దర్శించుకున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. కార్తీక మాసాంతం చేసే పూజల్లో భాగంగా సాయంత్రం ఆలయ ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని వెలిగించారు. మాడవీధిలో ఏర్పాటైన కళారాధన వేదికపై కళాకారులు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం

మంత్రాలయం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం క్షేత్రం కోలాహలంగా మారింది. ఆదివారం దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం అతిథిగృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు లభించక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేయాల్సిన పరిస్థితి. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరంలో భక్తుల రద్దీని నెలకొంది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమాలు

- కొనసాగుతున్న విశ్వశాంతి మహాయాగం



హోమంలో పాల్గొన్న భక్తులు

ఎమ్మిగనూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో సూర్య, సరస్వతీ సహిత చండీహోమాలు శ్రీ కృష్ణ పీఠాధిపతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు నిర్వహించారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో 87వ విశ్వశాంతి మహాయాగం 11రోజులుగా కొనసాగుతోంది. ఈ హోమాల్లో స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. హోమాలు చేసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో మైదానం భక్తులతో కళకళలాడింది. యాగశాలలో వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో యాగం చేశారు. హోమాల్లో పాల్గొన్న భక్తులకు స్వామిజీ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. భక్తులకు నిర్వాహకులు అల్పాహారం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం సీతారామ కల్యాణోత్సవను వైభవంగా నిర్వహించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ప్రముఖులు



ప్రాంగణంలో ఢిల్లీ పశువైద్య సంక్షేమబోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి ఎస్. కృష్ణ మిట్టల్, తెలంగాణ మెంబర్ మహేష్ అగర్వాల్

మంత్రాలయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం పలువురు ప్రముఖులు మంత్రాలయానికి చేరుకున్నారు. ఢిల్లీ పశువైద్య సంక్షేమ బోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి, జల్లికట్టు పరిశీలన అధికారి కృష్ణమిట్టల్, తెలంగాణ పశువైద్య వెల్ఫేర్ బోర్డు మెంబర్ డా.మహేష్ అగర్వాల్ కుటుంబ సమేతంగా ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతిఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనస్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి పాల్గొన్నారు.

గో సంరక్షణ కేంద్రం అభివృద్ధి చెందాలి

రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ కేంద్రం మరింత అభివృద్ధి చెందేందుకు శ్రీమఠం అధికారులు కృషిచేయాలని ఢిల్లీ పశువైద్య సంక్షేమ బోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి కృష్ణ మిట్టల్ అన్నారు. దర్శనం అనంతరం శ్రీమఠం గోశాలను పరిశీలించారు. గోవుల సంఖ్య, పశుగ్రాసం, సౌకర్యాలు, తాగునీరు, వైద్యం అంశాలపై పరిశీలించారు. మంత్రాలయంలో విశాలమైన గోసంరక్షణ కేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి గోసంరక్షణకు అవసరమైన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈపరిశీలనలో మంత్రాలయం మండల పశువైద్య అధికారి సంతోష్ కుమార్, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి వరప్రసాద్, గోశాల సూపర్‌వైజర్ రాఘవేంద్రరావు దేశాయ్, హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి మృత్యుఒడికి..

● బైక్‌ను ఢీకొట్టిన వాహనం ● మృతుడు జార్ఖండ్ వాసి



పవన్(ఫైల్)

మహానంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. జార్ఖండ్‌కు చెందిన పవన్(26) అనే యువకుడు గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో మరకత లింగేశ్వరుడు, నవగ్రహాల ఆలయంలో దినసరి కూలీగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఆదివారం కూడా యథావిధిగా ఆలయం నుంచి పశువుల ఫారానికి పాలు తెచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బుక్కాపురం నుంచి గాజులపల్లి వైపు వెళ్తున్న వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి బలవన్మరణం

కర్నూలు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో విఠల్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన భరత్‌కుమార్(20) అనే విద్యార్థి కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం 5వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా.. సరిగ్గా చదవకపోవడంతో తరుచూ మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి మాధవి గుర్తించి భర్త శ్రీరాములుకు ఫోన్ చేయగా.. ఆయన వచ్చి భరత్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వన రక్షకులు భద్రమేనా?

● అటవీ శాఖను వేధిస్తున్న ఆయుధాల కొరత
● ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పరిస్థితి మరీ దారుణం
● నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

వనాల సంరక్షణలో ప్రతిఒక్కరిని భాగస్వాముల్ని చేయాలన్న సంకల్పంతో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. ప్రత్యేకించి వనాల, వన్య ప్రాణుల సంరక్షణలో అటవీ శాఖ ఉద్యోగుల పాత్ర కీలకం. అడవితల్లి రక్షణకై ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. విధినిర్వహణలో వారి భద్రత ప్రశ్నార్థకంగా ఉందన్న విమర్శలున్నాయి. నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఉద్యోగుల రక్షణపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



అమరుల స్మారక స్థూపానికి అటవీ అధికారుల నివాళి

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆయుధాలను ఇవ్వడంలో ప్రభుత్వాలు జాప్యం వహిస్తున్నాయి. ఎర్రచందనం ఏరియాల్లో పనిచేస్తున్న అటవీశాఖ ఉద్యోగులకు మాత్రమే ఆయుధాలను అందించి మిగతా ఏరియాల్లో పనిచేస్తున్న వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అనేక సందర్భాల్లో అటవీ ఉద్యోగులు స్మగ్లర్ల చేతుల్లో బలికావాల్సిన పరిస్థితులు లేకపోలేదు. 2020 మే20న పెద్దపులుల సంరక్షణలో అత్యంత కీలకంగా ఉన్న ఆత్మకూరు అటవీ డివిజన్‌లో పనిచేస్తున్న 9మంది ఎఫ్ఎస్‌వోలకు, ఎఫ్‌బీ వోలను ఎంపిక చేసి వారికి 12బోర్ కంపాక్షన్ గన్స్, బుల్లెట్లను పంపిణీ చేశారు.



విధినిర్వహణలో అటవీశాఖ సిబ్బంది

రెచ్చిపోతున్న స్మగ్లర్లు

నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) పరిధిలో పనిచేస్తున్న అటవీ సిబ్బందికి సరైన ఆయుధాలు లేకపోవడంతో స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఉద్యోగులకు ఆయుధాలను అందిస్తే స్మగ్లర్లు అడవిలో అడుగు పెట్టేందుకు కూడా భయపడతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీనివాస్‌ను స్మరిస్తూ..



ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా, గోకవరం మండలం కోటిపల్లికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ కర్ణాటక క్యాడర్‌లో విధులు నిర్వహిస్తూ కలప అక్రమ రవాణా, వన్య ప్రాణుల వేట కట్టడికి శ్రీకారం చుట్టారు. తమ స్మగ్లింగ్‌కు శ్రీనివాస్‌గా అడ్డుగా ఉన్నారని భావించి వీరప్పన్ తన అనుచరులతో కలసి 1991, నవంబరు 10వ తేదీన ఆయన్ని హతమార్చారు. అటవీ రక్షణకై విశేష సేవలు అందించిన శ్రీనివాస్‌ను స్మరిస్తూ 1992 నుంచి నవంబర్ 10 న రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన మరణాంతరం 1992లో కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డుతో గౌరవించారు.

ఆయుధాలు ఇవ్వాలన్న అంశాన్ని..



అటవీశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆయుధాలు ఇవ్వాలన్న అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుంది. ఇదేజరిగితే అటవీ, వన్యప్రాణుల సంరక్షణ మెరుగుపడే అవకాశముంది. సోమవారం జరిగే అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రేంజర్ రామయ్య, వాచర్ లక్ష్మానాయక్‌లను స్మరించుకుంటాం. ● విఘ్నేష్ అప్పావ్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

అమరుడైన రేంజర్ రామయ్య



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 21మంది అటవీ ఉద్యోగులు అమరులయ్యారు. ఆత్మకూరు అటవీ డివిజన్‌కు చెందిన బైర్లూటి రేంజ్ అధికారి రామయ్య 1994 జూన్ 20వ తేదీన మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యారు. రేంజర్ రామయ్య ప్రాణత్యాగానికి జ్ఞాపకార్థంగా బైర్లూటిలో ఏర్పాటుచేసిన స్మారక స్థూపం వద్ద ప్రతిఏటా అటవీ అమరుల దినోత్సవం సందర్భంగా అటవీ ఉద్యోగులు నివాళులర్పిస్తారు. ఈ ఏడాది అక్టోబరు 18న వెలుగోడు రేంజ్ పరిధిలో లక్ష్మానాయక్ అనే ప్రొటెక్షన్ వాచర్ వన్యప్రాణి వేటాగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలను తగిన హతమయ్యాడు.



ఆత్మకూరు అటవీ సిబ్బందికి ఆయుధాలను అందజేస్తున్న దృశ్యం (ఫైల్)



పత్తి ఓబులయ్యకు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు

● 14వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్
● 14న హైదరాబాదులో ప్రదానం



కర్నూలు కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ నాటక దర్శకుడు, సాహితీవేత్త, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్యకు హైదరాబాదులోని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' (జీవితకాల పురస్కారం) ప్రకటించింది. కళారంగంలో ఆయన చేస్తున్న సుదీర్ఘ ఏళ్ల సేవలను గుర్తించి, సంస్థ 14వ వార్షికోత్సవ సందర్భంగా ఈ పురస్కారం ఈనెల 14న హైదరాబాదులోని చిక్కడపల్లిలో గల త్యాగరాజ గానసభలో జరిగే వార్షికోత్సవ వేడుకల్లో ప్రముఖుల చేతుల మీదుగా పత్తి ఓబులయ్యకు అందజేయనుంది. ఈ వివరాలు ఆదివారం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి ప్రకటించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఈ ఏడాది వరుసగా మూడుసార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో టీజీవీ కళాక్షేత్రానికి చోటు లభించేలా కృషి చేశారు. పత్తి ఓబులయ్య జిల్లా నాటక రంగ ఖ్యాతిని దశదిశలా చాటారు. గత రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా నిర్వహించిన నంది నాటక పోటీల్లో 38 నందులు సాధించిన ఘనత ఆయనకు దక్కుతుంది. వృత్తిరీత్యా తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్న కాలంలోనే పత్తి ఓబులయ్య అనేక శతకాలు రాశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షునిగా కొనసాగుతున్న పత్తి ఓబులయ్య కళాక్షేత్రం వ్యవస్థాపక చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ల సహకారంతో సంగీత కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారు.

రేపు జాతీయ విద్యా దినోత్సవం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా మంగళవారం మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పర్వీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు కలెక్టరేట్‌లో సాయంత్రం 4.30 గంటలకు సునయన ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

జీజీహెచ్‌లో ఆగని దొంగతనాలు

● ఫిజియోథెరపీ వార్డులో రాగి తీగలు, ప్రోబ్ పరికరాలను ఎత్తుకెళ్లిన దొంగలు



ఫిజియోథెరపీ విభాగం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. మొన్న ప్రసూతి విభాగంలో ముగ్గురు వైద్యుల పర్సులోని డబ్బులు చోరీ ఘటన మరువక ముందే తాజాగా శనివారం రాత్రి ఫిజియోథెరపీ విభాగంలో రూ.10లక్షల విలువైన పరికరం, రాగి వైర్లు ఎత్తుకెళ్లారు. సిబ్బంది శనివారం రాత్రి తాళం వేయకపోవడంతోనే దొంగతనం చోటుచేసకున్నట్లు తెలుస్తోంది. ఇదే గదిలోని ఆర్థోటిక్ చెందిన పాత పరికరాన్ని అపసంహరించేందుకు విఫలయత్నం చేశారు. సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు ఉదయం ఫిజియోథెరపీ విభాగాన్ని పరిశీలించారు. ఆర్ఎంవోలతో చర్చించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



దొంగలు అపహరించేందుకు ప్రయత్నించిన పరికరం ఇదే

సూపరింటెండెంట్ ఆగ్రహం

ఫిజియోథెరపీ విభాగంలో దొంగతనంపై సూపరింటెండెంట్ ఈగల్ హంటర్ ఏజెన్సీ ఎస్‌వో రామకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది జాబితా ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగిన ఎందుకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. 238 మంది ఉండాల్సి ఉండగా, 160 మంది మాత్రమే ఉన్నారని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్లను సస్పెండ్ చేశారు. సర్జెంట్ ఉరుకుందయ్యను విధుల నుంచి తప్పించి మరొకరికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు.



చోరీకి గురైన ప్రోబ్ పరికరం

మానవ సంబంధాల సౌరభం వనభోజనం

● రాయలసీమ వర్సిటీ వీసీ బసవరావు
● ఘనంగా పద్మశాలీయుల వన భోజన మహోత్సవం

కర్నూలు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మనుషులు సెల్‌ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల మసకబారుతున్న మానవ సంబంధాలను బలోపేతం చేయడం, పచ్చని ప్రకృతిలో మమేకమై ఐక్యతను చాటడం, వన సంరక్షణలో మానవాళిని భాగస్వామ్యం చేయడమే వన భోజన మహోత్సవం ప్రధాన లక్ష్యమని రాయలసీమ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు పేర్కొన్నారు. కర్నూలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సుంకేసుల రోడ్డులో ఉన్న ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో కార్తీక వన భోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులకు సన్మానం

పద్మశాలి సంఘం అధ్యక్షుడు కస్తూరి వేమయ్య, ప్రధాన కార్యదర్శి మేడం సుంకన్న, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచారు. తులసి, దామోదర కల్యాణ మహోత్సవం, ఉసరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రజా సేవలో మమేకమైన పద్మశాలి ప్రముఖులు, నీట్, జేఈఈలో ప్రతిభ చూపిన చిన్నారులు, కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలను కనువిందు చేశాయి. ముఖ్య అతిథులుగా హాజరైన రాయలసీమ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బసవరావు, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ మాట్లాడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పద్మశాలి సంఘం కోశాధికారి గుర్రం శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు క్యాబర్సి గోవిందు, కార్యదర్శి జేరుబండి హరిప్రసాద్, ఉపాధ్యక్షులు సిరసాల లక్ష్మీనారాయణ, కస్తూరి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.



పద్మశాలి వన భోజన మహోత్సవంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో..



కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం కార్తీక వనభోజన వేడుకల్లో తుగ్గలి నాగేంద్ర, జి. పుల్లయ్య, పీబీవీ సుబ్బయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఏఎంఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో శాలివాహన ఫెడేషన్ మాజీ అధ్యక్షుడు, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, పారిశ్రామికవేత్త రమణ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు సుధాకర్, పీబీవీ సుబ్బయ్య, సంఘం నగర అధ్యక్షుడు సోమేష్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మద్దయ్య, సీనియర్ నాయకులు నాగన్న, మధు, ఓబులేసు, పాండు రంగస్వామి, సురేష్, లక్ష్మన్న, నరసింహుడు, జయరాముడబు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉసిరిక చెట్టు వద్ద పూజలు చేశారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని కుమ్మర కులస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

16న బలిజ వనభోజన మహోత్సవం


కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న బలిజ సంఘం వనభోజనం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ అన్నారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో కరపత్రాలు విడుదల చేశారు. జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక విజ్ఞానపీఠం పాఠశాల ఆవరణలో ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అక్కడే వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశామని, తల్లిదండ్రులు పెళ్లి కావాల్సిన తమ పిల్లల వివరాలతో హాజరు కావాలని సూచించారు. కాపునాడు అధ్యక్షుడు అర్జా రామకృష్ణ, పత్తి ఓబులయ్య, రామస్వామి, చింతా సురేష్, జక్కుల స్వామిరెడ్డి, లక్ష్మీనారాయణ, ఇద్దం వెంకట రమణ, శ్రీనివాసమూర్తి సుజాత, బ్రాహ్మణి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం



మంత్రి లోకేశ్‌తో రామకృష్ణ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం చేకూరుతుందని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అమరావతిలో ఐటీ, విద్యాశాఖ మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశానన్నారు. కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించినందుకు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపానన్నారు.

నేడు నగర పాలికలో ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. స్థానిక సమస్యలను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని, నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందన్నారు. సమస్య స్థితిని https://meekosam.ap.gov.inలో చూడవచ్చని పేర్కొన్నారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘ కార్యవర్గం


ఏపీటీడబ్ల్యూటీయూ నూతన కార్యవర్గం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. బి.క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడిగా పి.జమ్మన్న, ఉపాధ్యక్షుడిగా బి.రాజోరాణి, ఎం.శంకర్, జిల్లా గౌరవాధ్యక్షులుగా అహోబులేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకట మహేంద్ర, ఉప ప్రధాన కార్యదర్శిగా పీవీఆర్ కిషోర్, జిల్లా కోశాధికారిగా ఎం.రామ నాయుడు, సభ్యులుగా పి.శివకృష్ణ, కేవీ సుబ్బయ్య, శివశంకర్, శకుంతల, మనీషా ఎన్నికయ్యారు.

గొల్లల దొడ్డిలో రహదారి నిర్మించాలి


ఎమ్మెల్యేకు విన్నతి పత్రం అందజేస్తున్న దూద్‌వలి

సి.బెళగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొల్లలదొడ్డి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించి, వీధి విధి దీపాలు ఏర్పాటు చేయాలని మైనార్టీ నాయకుడు దూద్‌వలి కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సర్వే చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్మికులకు బీమా కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు హమాలీ కార్మికులరూ.10 లక్షల బీమా కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం హమాలీ కార్మికులతో మాట్లాడుతూ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికునిగా పని చేస్తూ అగ్రసేని ఆసుపత్రిలో చనిపోయిన మహేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం మహేష్ స్వగ్రామం పెద్దటేకూరులో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మార్కెట్ యార్డు యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.రాముడు, ఆనంద్‌బాబు, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, ఆర్.నరసింహులు, మహ్మద్, రఫి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళికృష్ణ నాయుడు అధ్యక్షతన జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవనంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడుగా ఈ.నాగిరెడ్డి(పీఆర్ఐ డీఈ పాణ్యం), ప్రధాన కార్యదర్శిగా ఆర్.సతీష్‌కుమార్, (పీఐయూ ఏఈ, కర్నూలు), ఉపాధ్యక్షుడిగా ఎస్.చంద్రశేఖర్(ఎమ్మిగనూరు డీఈ పీఆర్ఐ), కోశాధికారిగా మహదేవప్ప(ఏఈ పీఆర్ఐ ఆదోని), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.జోత్స్న(ఏఈ పీఆర్ఐ, కర్నూలు)ను ఎన్నుకున్నారు. రవీంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వనభోజనాల సందడి

- నగరంలో రెడ్డి, తెలుగు బెస్త, బలిజ, బ్రాహ్మణ, యాదవ, గౌడ కులస్థుల వనభోజనాలు
- ఆటపాటలు, విందు భోజనాలతో సంతోషం


ఎమ్మెల్యే గౌరు చరితను సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు



బెస్త, తెలుగు, గంగపుత్ర సంఘం కార్తీక వనభోజనం


బ్రాహ్మణ వనభోజనంలో ప్రసంగిస్తున్న సండేల్ చంద్రశేఖర్

కల్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జీఆర్‌సి కన్వెషన్‌లో రెడ్డి సామాజిక కార్తీక వనభోజనం ఆదివారం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ.మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ సంఘం తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆర్టిస్ట్ శివాజీ మిమిక్రీ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేజే.రెడ్డి, కెవీసుబ్బారెడ్డి, పులకుర్తి నరసింహారెడ్డి, పి.ప్రభాకర్‌రెడ్డి, దొనపాటి ఎల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బెస్త, తెలుగు, గంగపుత్ర సంఘం..

కర్నూలు కల్చరల్: నగరంలోని సిటీ బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జమ్మిచెట్టు సమీపంలోపి లలితా పీఠంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా బెస్త సంఘం చైర్మన్ అప్పల రాజు, జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు చాపల రమేష్, భాస్కర్, రామాజనేయులు పాల్గొన్నారు. బెస్త, తెలుగు, గంగపుత్రులు ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ రంగాల్లో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. డాక్టర్ కదిరి రమేష్ జలగరి వెంకటేశ్వర్లు, నాగరమణ, వెంకటేశ్, గోపీనాథ్ పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: నగరంలోని టి.శేషన్న నగర్‌లో వనభోజనానికి జనసేన కర్నూలు జిల్లా ఇన్‌చార్జి కేవీ రమణ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, కే.రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సభాధ్యక్షుడు టి.గోవిందస్వామి ఉన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి సహకరించాలి

కర్నూలు కల్చరల్: పేద బ్రాహ్మణుల అభివృద్ధికి సహకరించాలని సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కోరారు. ఆదివారం సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో వనభోజనం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేశారన్నారు. ముఖ్య అతిథులు శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ చిట్టిబట్ల భరద్వాజ శర్మ, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర, డోన్ తహసీల్దార్ అంజన్నబాబు, విశ్రాంత డీఎస్పీ తేజేశ్వరరావు, విశ్రాంత హోంగార్డ్స్ ఎస్పీ చంద్రమౌళిని సన్మానించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు ధార్వాడ ఆనందరావు, ఎస్‌కే శ్రీనివాసరావు, కళ్లే వేణుగోపాల్ శర్మ, బ్రాహ్మణ సంఘం కార్యదర్శి చల్లా నాగరాజు శర్మ, ఉపాధ్యక్షుడు కె.శ్యామసుందర్ రావు, నాగులవరం రాజశేఖర్, సీఎస్ ప్రసాదరావు, పాల్గొన్నారు.



యాదవ వనభోజనంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు రూరల్: యాదవులు, సామాజిక, విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం జగన్నాథగట్టులో కార్తీక వనభోజనంలో ఆయన పాల్గొన్నారు. జి.ఎ.కృష్ణమూర్తి, సింధూనాగేశ్వరరావు యాదవ్ అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేస్తోందన్నారు. సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం కావాలని కోరారు. ఏపీ నామయ్య యాదవ్, రాంపుల్లయ్య యాదవ్, డాక్టర్ బాలమద్దయ్యయావ్, నరసింములు యాదవ్, శేషు యాదవ్ పాల్గొన్నారు. ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. సోమన్న యాదవ్,నాగరాజు, శేషఫణి యాదవ్, సదానందం యాదవ్, ఓబులేసు యాదవ్, సీతారం యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

గౌడు కులస్థుల ఐక్యతకు నిదర్శనం వన భోజనం

కర్నూలు అర్బన్: కార్తీక వనబోజనం ఈడిగ, గౌడ కులస్థుల ఐక్యతకు నిదర్శనమని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని నీలకంఠ స్వామి గుడిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేఈ విజయకుమార్, వర్కింగ్ ప్రసిడెంట్ కాసాని మహేష్ గౌడ్ అధ్యక్షతన వనభోజనం నిర్వహించారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, మెడిసిన్ విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం ఇస్తామని హామీ ఇచ్చారు. నాయకులు శ్యామ్ సుందర్ గౌడ్, గంగాధర్ గౌడ్, గోవిందు గౌడు, శివరాం గౌడ్ రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా మలుపు విస్తరణ పనులు

- నగర పాలక కమిషనర్ విశ్వనాథ్


రహదారి విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికల్ కాలేజీ మలుపు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం దుకాణాలను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులతో సమన్వయం చేసుకుని రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని, డ్రైనేజీ అనుసంధానానికి చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాలు తొలతించ డంతో ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కారమవుతాయన్నారు. అదేవిధంగా గాయత్రీ ఎస్టేట్ కూడలి కుదింపు పనులు వేగంగా జరుగుతున్నాని, త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని, దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన మంజులాదేవి

- రెండు గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్



కర్నూలు హాస్పిటల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్టాఫ్ నర్సు దువ్వూరు మంజులాదేవి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటింది. గత నెల 11, 12 తేదీల్లో గుంటూరు మంగళగిరిలో నిర్వహించిన స్విమ్మింగ్ పూల్ మాస్టర్ జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్, సిల్వర్, కాంస్య పతకాలు సాధించింది. అలాగే ఆదివారం విజయవాడలో జరిగిన పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్ రెండు సిల్వర్ మెడల్స్ సాధించి కర్నూలు జీజీహెచ్ ప్రతిష్ఠను పెంచింది. విజయ వాడ మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో6వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీల్లో మదమీటర్ల ఫ్రీ స్టైల్‌లో గోల్డ్ మెడల్ 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో గోల్డ్, బ్యాక్ స్ట్రోక్ 50మీటర్ల సిల్వర్, 50 మీటర్ల ఫ్రిస్టెయిల్‌లో సిల్వర్ మెడల్ సాధించించింది.

14న కాల్వబుగ్గలో బహిరంగ వేలం

ఓర్వకల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో మద్దిలేటి ఆదివారం తెలిపారు. దేవస్థానంలో టెంకాయల అమ్మకం, పార్కింగ్ ఫీజు, తాత్కాలిక కళ్యాణ మండపం నిర్మించుకునే హక్కు, టీటీడీ కళ్యాణ మండపం, సుంకిరెడ్డి సత్రం, సదానంద సత్రంలో సప్లయర్స్ తదితర వాటికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామన్నారు. పాటదారులు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కోడుమూరు రూరల్, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన మేరకు.. మహిళ భర్త సుమారు 11 ఏళ్ల క్రితం మృతి చెందడంతో పుట్టినింటికి వెళ్లి, ఆరునెలల క్రితమే భర్త స్వగ్రామానికి చేరుకుంది. శనివారం కోడుమూరులో సంతకు వెళ్లి కొత్తబస్టాండు వద్ద తనను ఇద్దరు వ్యక్తులు వెంటబడ్డారని ఆడబిడ్డ భర్తకు ఫోన్ చేసింది. అనంతరం ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయినట్లు గుర్తించారు. ఆదివారం కూడా ఇంటికి తిరిగిరాకపోవడంతో మహిళ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

గూడూరు నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోకులపాడు సమీపంలో ఆదివారం కారు మోటర్‌సైకిల్‌ను ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. కె.నాగలాపురం ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తెలిపిన మేరకు.. పులకుర్తి నుంచి అయ్యప్పమాలధారులు హైదరాబాద్‌కు వెళుతున్నారు. కారు ఎక్స్‌ఎల్ మోటార్‌ను ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న వారికి, మోటర్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి.

టీడీపీ నాయకుడి మృతి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనపల్లె గ్రామ టీడీపీ నాయకుడు మాల లక్ష్మన్న (55) ఆదివారం మృతి చెందారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భౌతికకాయానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ గెలుపుకు లక్ష్మన్న కృషిచేశారని, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సూదిరెడ్డిపల్లె వ్యవసాయ పరపతి సహకార సంఘం ప్రెసిడెంట్ బళ్లారి వెంకట్రాముడు, బళ్లారి శ్రీనివాసులు, నూతనపల్లె అయ్యస్వామి ఉన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించండి

- విద్యుత్ ఎస్ఈకి సూచించిన ఎంపీ


ఎంపీతో సమావేశమైన ఎస్ఈ ప్రదీప్‌కుమార్

కల్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలం దించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎంపీతో విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ ఎస్ఈ ఆర్.ప్రదీప్ కుమార్ సమావేశమయ్యారు. ఎస్ఈ విద్యుత్ శాఖలోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ ఎస్ఏ సత్తార్‌కు పురస్కారం


డాక్టర్ సత్తార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో భాగంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా రత్నాలు పురస్కారాలను కేఎంసీ విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎస్ఏ సత్తార్‌కు అందజేశారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా.పి.చంద్ర శేఖర్‌ను జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ నంద్యాలకు చెందిన డా.ఎస్ఏ సత్తార్ 1957 లో కర్నూలు మెడికల్ కాలేజీ మొదటి బ్యాచ్ విద్యార్థి అని 1969లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారన్నారు. అనంతతరం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కర్నూలు జీజీహెచ్ సూపరిం టెండెంట్‌గా సేవలు అందించారన్నారు. 1998లో పదవీ విరమణ పొంది 27 సంవత్సరాలుగా పాతబస్టాండు సమీపంలోని క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్నట్లు గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర అన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం జొహరాపురంలో నిరసన తెలిపారు. కార్మికులు పోరాటాలు చేసి యూపీఏ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డును సాధించుకున్నారన్నారు. నగర కార్యదర్శి సి.నాగరాజు, నాయకులు సుధాకరప్ప, షేక్‌అహ్మద్, షఫి, బహదూర్, మదు తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

- రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

కర్నూలు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు, నేర చరిత్రగలవారికి, పోలీసు అధికారులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్‌ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మరో రైతుబజార్

- సి.క్యాంపులో నిర్మాణానికి రూ.6 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు


స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సునీత (ఫైల్)



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతు బజార్‌ను విస్తరిస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఈ ఏడాది మే నెలలో సీఎం కర్నూలులో పర్యటించిన విషయం విదితమే. సి.క్యాంపు రైతు బజారును చూసి ఒకప్పుడు తాను నాటిన విత్తనం (సీ.క్యాంప్ రైతుబజార్) ఈరోజు శాకోపశాఖలుగా అభివృద్ధి చెంది వందలాది మంది రైతులు, పొదుపు మహిళలకు ఉపాధి కల్పిస్తున్న విషయం స్వయంగా పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉన్న ఈ రైతు బజారును విస్తరించాలన్న రైతులు, పొదుపులక్ష్మి గ్రూపుల విజ్ఞప్తి మేరకు ఇప్పటికే ఆర్అండ్‌బీ క్వార్టర్లు కేటాయించిన స్థలంలో మరో రైతుబజారును నిర్మిస్తామన్నారు. అమరావతికి వెళ్లిన తక్షణమే నివేదిక తయారు చేయాలని మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడంతో డీఈఈ రఘునాథరెడ్డి, సిబ్బంది రూ.6.5 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి నివేదించారు. వారం క్రితం ఆ శాఖ కమిషనర్ విజయ సునీత నివేదికను ఆమోదించి, ఆర్థిక శాఖకు పంపగా ఆమోదం పొందినట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నారాయణమూర్తి తెలిపారు.

ఇదీ రైతు బజార్ స్వరూపం..

కొత్తగా నిర్మించబోయే రైతుబజార్‌లో 155 స్టాల్స్ 35 షాపులు, మరో రెండు టాయిలెట్స్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. వారంలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ను ఖరారు చేయనున్నారు. ప్రస్తుతం నగర జనాభా సుమారు 6లక్షలు. ఇక్కడ కూరగాయలు కొనేందుకు సమీప గ్రామాలు, ఇతర పట్టణాల నుంచి కూడా వినియోగదారులు వస్తున్నారు. దీంతో రైతు బజారు స్థలం సరిపోవడం లేదు. కొత్త రైతు బజార్ నిర్మాణం పట్ల వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగుతాయి



సి.క్యాంపు రైతు బజార్‌లో రద్దీతో కూరగాయలు కొనేందుకు ఎక్కువ సమయం పడుతుంది.. నూతన రైతు బజార్ నిర్మాణంతో ఇబ్బందులు తొలుగుతాయి. సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు. **- సుభాషిణి, వినియోగదారురాలు, కర్నూలు.**

త్వరలోనే టెండర్లు



నగరంలోని సి.క్యాంపు రైతుబజార్ పక్కనే రూ.6 కోట్లతో నూతన రైతుబజార్ నిర్మించనున్నాం. త్వరలోనే టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ కాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తాం. రైతులు, వినియోగదారులకు సౌకర్యంగా ఉంటుంది. **- రఘునాథరెడ్డి, డీఈఈ**

మహిళా చైతన్యం, వృద్ధుల సంరక్షణే లక్ష్యం


మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయాధికారి సుధ

ఆదోని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో బృహత్తకర న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. మహిళలు, తల్లిదండ్రుల సూచన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి పి.జె.సుధ హాజరై ప్రసంగించారు. ఆమె మహిళా హక్కులు, వృద్ధుల సంరక్షణ చట్టాలపై దృష్టి సారించారు. మహిళలు మనోధైర్యం కోల్పోకుండా చైతన్యవంతంగా ముందుకు సాగి మంచి జీవితాన్ని గడపాలని సూచించారు. పీసీ అండ్‌పీఎన్‌డీటీ యాక్ట్ (లింగ నిర్ధారణ నిషేధం), గృహహింస చట్టం, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషించని సంతానంపై చర్యలు తీసుకునే చట్టం గురించి వివరించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, తాలూకా సీఐ నల్లప్ప, బార్ ప్రెసిడెంట్ శ్రీరాములు, వన్ టౌన్ ఎస్‌ఐ సమీర్‌బాషా, త్రీటౌన్ ఎస్‌ఐ రామస్వామి, న్యాయవాదులు లోకేష్‌కుమార్, నవీన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నళిని పాల్గొన్నారు.

చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జ్ఞానయజ్ఞం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 12 నుంచి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భగవద్గీత జ్ఞాన యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిషన్ ఆచార్యులు బ్రహ్మచారి నారాయణ చైతన్య తెలిపారు. ఆదివారం జ్ఞానయజ్ఞ పోస్టర్లను విడుదల చేశారు. ఆర్ట్స్ కళాశాల రహదారిలోని చిన్మయ మిషన్‌లో 12 నుంచి 17వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం భగవద్గీతపై స్వామీజీ చిద్విపానందచే ప్రవచనాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధ్యక్షుడు ఏగాటి ప్రతాప్, రఘునాథ్ శ్రీనివాస్ రమేష్ శ్రీనివాసులు జగదీష్ పాల్గొన్నారు.


పోస్టరును విడుదల చేస్తున్న చిన్మయ మిషన్ స్వామీజీ

ఆదోనిని జిల్లా చేయాలి

మద్దికెర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ప్రతిపాదనలో పారిశ్రామికంగా అభివృద్ధిలో ఉన్న ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని రాయలసీమ కాపు సంఘం నాయకులు వైపీ వీరన్న డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల రూపకల్పన పై ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర మంత్రులు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆదోనిని జిల్లా చేసే విధంగా చూడాలన్నారు.

సొంత నిధులతో గుంతల పూడ్చివేత


గుంతలను పూడ్చివేస్తున్న టీడీపీ నాయకులు

వెల్దుర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రమైన వెల్దుర్తిలో ప్రధాన రోడ్డుపై గుంతలు, రహదారి పక్కన గోతులు ఏర్పడి ప్రజలు, ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ప్రజలు మండల అధ్యక్షుడు బలరాంగౌడు, సింగిల్ విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు సొంత తమ నిధులతో ఆదివారం పాతబస్టాండ్, పోలీస్‌స్టేషన్, కొత్తబస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి వరకు రోడ్డుపై, రోడ్డుపక్కల ఏర్పడిన గుంతలు, గోతులను డోజర్ సాయంతో పూడ్చివేశారు. సమస్యను పరిష్కరించిన నాయకులు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రమాణ స్వీకారాన్ని జయప్రదం చేయండి

ఆస్పరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా మాజీ ఎంపీపీ బిల్లేకల్ వెంకటేష్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుండడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున ఆదివారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పరి మండలానికి పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యత ఇచ్చి చైర్మన్ పదవిని కట్టబెట్టడం సంతోషదాయకమన్నారు. గ్రామస్థాయి కార్యకర్తలు, నాయకులు ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

తుగ్గలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్, జడ్పీటీసీ సభ్యులు పులికొండ నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జి.ఎర్రగుడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో చాలా మంది రైతులు ఉల్లి పంట సాగు చేసి పెట్టుబడులు కూడా దక్కక అప్పులపాలయ్యారనీ, వెంటనే ప్రభుత్వం కల్పించిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవం

పత్తికొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో ఆదివారం న్యాయ సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోష్ణదేవి ఆదేశాల మేరకు స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో న్యాయసేవ దినోత్సవం జరిగింది. అడ్వకేట్లు భాస్కర్, సూరాజ్, నబి, పీఈటీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ఉదయం..
వనభోజన మహోత్సవం


ఆదోనిలో వివిధ హోదాల్లో ఉన్న వారిని సన్మానిస్తున్న దృశ్యం


పత్తికొండలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్ననాయకులు

ఆదోని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస వనభోజన వేడుకలు కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో చేకూరి ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. ముందుగా మహానటుడు, నటసార్వభౌముడు స్వర్గీయ నందమూరి తారక రామారావుని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారి ఆశయాలు, సమాజ సేవ మార్గాన్ని కమ్మ బంధువులు గుర్తు చేసుఉన్నారు. కమ్మ కులంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు, వైద్యులు, వివిధ శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగులు, రిటైర్డ్ వ్యక్తులను సన్మానించారు. కమ్మ బంధువుల మధ్య ఆత్మీయత, ఐక్యమత్యాన్ని పెంచేందుకు ఈ వనభోజన వేడుక ఎంతగానో దోహద పడిందని టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు, మారుతినాయుడు, వెంకటేష్‌చౌదరి పేర్కొన్నారు.

పత్తికొండ: అందరికి ఆదర్శంగా ఉందామని కాకతీయ కమ్మసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు అన్నారు. ఆదివారం పత్తికొండ ఎం.కన్వెన్సన్‌లో కాకతీయ కమ్మసంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వేలురు రామప్ప, రాంబాబు ఆధ్వర్యంలో కమ్మసంఘం వనభోజన కార్యక్రమం జరిగింది. ముందుగా ఉసిరి చెట్టుకు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమ్మ కులస్థులు విద్యా, వ్యాపార రంగాల్లో ముందున్నామన్నారు. పేదలను ఆదుకునేందుకు ముందుండాలన్నారు. అలాగే వెనుకబడ్డ కమ్మకులస్థులను గుర్తించి వారి అభివృద్ధికి చేయూత నందించాలని పిలుపునిచ్చారు. దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కమ్మసంఘం నాయకులు మనోహర్‌చౌదరి, పారరామచంద్రప్రసాద్, వైకుంఠం మల్లిఖార్జునచౌదరి, ఎల్లారవి, సుధాకర్‌చౌదరి, సురేశ్‌చౌదరి, వైకుంఠం ప్రతాప్‌తో పాటు కమ్మ సంఘం నాయకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సాగునీటి కోసం సీపీఎం పాదయాత్ర


పెద్దతుంబళంలో ప్రారంభమైన సీపీఎం పాదయాత్ర

ఆదోని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండల రైతులకు సాగునీరు ప్రజలకు తాగునీరు అందించాలంటూ సీపీఎం పాదయాత్ర చేపట్టింది. ఆదివారం పెద్దతుంబళం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాయకులు వెంకటేశులు, లింగన్న మాట్లాడుతూ, ప్రభుత్వం తుంగభద్ర నదీపై మేళిగనూరు వద్ద వరద కాల్వ నిర్మించి కౌతాళం, ఆదోని మండల రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తాగునీరు లేక మండల ప్రజలు అనేక ఇబ్బందులుఎదుర్కొంటున్నారని, పట్టించుకొనే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రహదార్లు పూర్తిగా గుంతలమయం కావడం జరిగిందని, అధికారులకు కనపడడం లేదా? అని ప్రశ్నించారు.

ఆలూరు రూరల్: ఆలూరు నియోజకవర్గానికి జీవనాధారం కోసం సాగు, తాగునీటికై వేదావతి, నగరడోన ప్రాజెక్టుల సాధనకై ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి.అంజిబాబు అన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన 9, 10న ఆలూరు నుంచి ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే పాదయాత్రను ఆలూరు చెక్‌పోస్టులో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంజిబాబు ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఎం నాయకులు క్రిష్ణ, షాకీర్, మైన, వెంకటేశ్వర్లు, రత్నమ్మ పాల్గొన్నారు.

ఆస్పరి: ఆలూరు నియోజకవర్గం పూర్తి స్థాయి వెనుకబడిన ఆస్పరి మండల ప్రధాన సమస్యలైన సాగు, తాగునీటి సమస్యల పరిష్కారంపై ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాలకృష్ణ, మల్లేష్, రంగస్వామి, రామాంజనేయులు, రవిపాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు సహకరిస్తాం


ఆర్డీవోకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న నిర్వాహకులు

మద్దికెర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర మద్దమ్మ కుంట సమీపాన వెలసిన శ్రీసుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరగబోయే సుబ్రమణ్యస్వామి షష్ఠి ఉత్సవాలకు సహకరిస్తామని ఆర్డీవో భరత్ నాయక్ తెలిపారు. ఆదివారం ఆలయ నిర్వాహకులు ఎస్.విజయప్రసాద్ యాదవ్ ఆర్డీవోను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించి.. శాలువ కప్పి స్వామివారి చిత్రపటాన్ని, షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ షష్ఠి ఉత్సవాలకు రెవెన్యూ పరంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే దేవాలయ అభివృద్ధికి కూడా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎస్.విజయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'సన్నిధానంలో నిషేధాజ్ఞలను పాటిద్దాం'

ఆదోని టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శబరిమల ప్రాంతంలో పరిశుభ్రతను పాటించే చర్యలలో భాగంగా కేరళ రాష్ట్రం హైకోర్టు జారీ చేసిన నిషేధాజ్ఞలను మాలధారులందరూ పాటించాలని గురుస్వామి శ్రీనివాస ఆచారి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పంబా నదిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకొని పోవడంతో వాతావరణ కాలుష్యం పెరిగి పోవడాన్ని గమనించిన హైకోర్టు ప్లాస్టిక్, షాంపూ పాకెట్లు, రసాయన కుంకుమను వినియోగించడం నిషేదించారని తెలిపారు. అయ్యప్ప దర్శనానికి జనవరి వరకు శబరిమలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, నిషేధాజ్ఞలను గురుస్వాములు అందరూ తమ గ్రూపులలో అందరికీ తెలియపరచాలని కోరారు.

ఓబీసీ జనగణన చేపట్టాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓబీసీ జనగణన చేపట్టడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని బాంసెఫ్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. ఆదివారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అధ్యక్షతన బీసీ సంఘాల ప్రతినిధులతో బాంసెఫ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సెంట్రల్ కమిటీ సభ్యుడు డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ వివి సుబ్రహ్మణ్యం, ఇంటలెక్చువ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి ఖాదిరుల్లా, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపకరాలు పట్నం రాజేశ్వరి హాజరయ్యారు. సాయిబాబు, షేక్షావలి, చెన్నబసప్ప, నల్లారెడ్డి, పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌యార్డు పాలకవర్గ సమావేశం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైకుంఠం శివప్రసాద్, వెంకటేశ్వర్లు

ఆలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్ యార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుందని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్ కోరారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో వారు ఏర్పాట్లను పరిశీలించారు. మార్కెట్‌యార్డుకు తొలిసారిగా దళిత సామాజికవర్గానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అన్నివర్గాలకు డైరెక్టర్ పదవుల్లో ప్రాధాన్యతను టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి కల్పించారన్నారు. ఆయన వెంట డైరెక్టర్ బండారి మారుతి, బీఎస్ఎన్ఎల్ సభ్యులు జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులతో భూమి విషతుల్యం

● ప్రకృతి వ్యవసాయరంగ నిపుణుడు గంగాధరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న గంగాధరం

పత్తికొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధిక రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి విషతుల్యం చెందిందని, ప్రకృతి, సేంద్రియ పద్ధతులు పాటిస్తే భూమి ఆరోగ్యకరంగా ఉంటుందని, ఆ దిశగా ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు పయనం సాగించాలని ప్రకృతి వ్యవసాయరంగ నిపుణులు గంగాధరం రైతులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని మండిగిరి రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో రైతు కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాధరం మాట్లాడుతూ పూర్వీకులు వ్యవసాయంలో పశువులు పేడతో వ్యవసాయాన్ని సాగు చేసేవారని గుర్తు చేశారు. గత 40 ఏళ్లుగా రసాయనిక ఎరువులు భూమిలో అధికంగా వాడకం వల్ల భూమిలో ఉన్న సారవంతం దెబ్బతిని విషతుల్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికైనా రైతులు మేల్కొని వ్యవసాయరంగంలో మార్పులు చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఉమాపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, పంపన్నగౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, టీడీపీ రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణచౌదరి, సోమ్లానాయక్, ఎస్టీయూ నాయకులు సత్యనారాయణ, సుంకన్న, రైతు ప్రతినిధులు భీమలింగప్ప, రంగారెడ్డి, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైకుంఠం సాయిదినేష్

ఆలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం.. ప్రశాంతత ఉంటుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి తనయుడు టీడీపీ యువ నేత వైకుంఠం సాయిదినేష్ అన్నారు. మండల పరిధిలోని మొలగవల్లి గ్రామంలో చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ పోటీలను టీడీపీ యువ నేత వైకుంఠం సాయిదినేష్ ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వేదపండితులు శివస్వామి, టీడీపీ యువ నాయకుడు విశ్వతేజ్, టీడీపీ సీనియర్ నాయకులు బెలగంటి హనుమప్ప, బేవిన ఈరన్న, షేక్షావలి, కంది శీనప్ప, సోమశేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో కుట్టు మిషన్లు


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నమాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడు

వెల్దుర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామ స్వరాజ్యం స్వచ్ఛంద సేవాసంస్థ, శ్రీగిరి గోవర్ధనగిరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు ఆదివారంసిద్ధనగట్టు, రత్నపల్లి, నర్సాపురం గ్రామాల్లో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. రూ.13200 విలువ గల కుట్టు మిషను 50 శాతం సబ్సిడీతో రూ.6700లకు అందిస్తున్నామని తెలిపారు. కుట్టు మిషన్లు కావాల్సిన వారు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూదేపల్లి జయరాముడు, సిద్దనగట్టు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, రామమద్దిలేటి, శివకృష్ణ, రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

12న నిరసన

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 12న ప్రజా ఉద్యమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోస్టరును తన కార్యాలయంలో విడుదల చేశారు. చంద్రకాంత్ రెడ్డి, కామాక్షి, తిమ్మప్ప, శేషిరెడ్డి పాల్గొన్నారు.

రేపు స్వర్ణామృత ప్రాశనం పంపిణీ

ఆదోని టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చే స్వర్ణామృత ప్రాశనం ఔషధాన్ని 18వ విడతగా మంగళవారం పంపిణీ చేయనున్నట్లు ఆవోపా సంస్థ అధ్యక్షుడు ఆదివారం తెలిపారు. 9849478178 నెంబరును సంప్రదించి పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రజకులకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి

మద్దికెర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని మండల రజక సంఘం నాయకులు చిరంజీవి, వెంకప్ప, శ్రీనివాసులు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కులవృత్తి పై ఆధారపడి జీవనం సాగించే రజకులకు 200 యూనిట్లు ఉచితంగా కరెంటు ఇస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రజకులకు రాయితీతో యంత్ర పరికరాలు ఇవ్వాలని కోరారు.

ఎస్టీ జాబితాలో చేర్చేవరకు పోరాటం

తుగ్గలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు పోరాటాలు ఆపేది లేదని వాల్మీకి సంఘం నాయకులు చౌడప్ప, అశోక్, సుధాకర్ అన్నారు. ఆదివారం నంద్యాలలో నిర్వహించిన వాల్మీకి మౌన దీక్ష కార్యక్రమానికి తుగ్గలి మండలంలోని కడమకుంట్ల నుంచి బారీగా వాల్మీకి సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయ, వాల్మీకుల ఓట్లను వేయించుకున్నారే తప్ప.. వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇలాంటి ప్రభుత్వాలకు రాబోవు రోజుల్లో వాల్మీకులు బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సోమశేఖర్, రాజు, వెంకటేష్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న చేపట్టిన ప్రజా ఉద్యమానికి పార్టీలకు అతీతంగా సీపీఐ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు హాజరై మద్దతు ఇవ్వాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రజా ఉద్యమం వాల్ పోస్టర్లను వైసీపీ నాయకులు, కార్యకర్తలు విడుదల చేశారు. మండల కన్వీనర్ మల్లికార్జున, అర్ధగేరి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, గిరి, భాస్కర్, అరికెర వీరేష్ పాల్గొన్నారు.

హాలహర్వి: వైసీపీకి కార్యకర్తలే శ్రీరామరక్షగా నిలుస్తూ మమ్మల్ని నడిపిస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. ఆదివారం ఆయన బాపురంలో కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఆలూరు టీడీపీ పార్టీలో విబేధాలు తారాస్థాయికి చేరాయని, వారు ఉనికి కోసమే పక్క పార్టీలవైపు చూస్తున్నారు తప్ప.. తమ కార్యకర్తలకు అలాంటి పరిస్థితి రాలేదన్నారు. టీడీపీ పార్టీ నాయకులు కూడా తమ పార్టీలోకి చేర్చుకోవాలంటూ తమపై ఒత్తిడిలు వస్తున్నాయని, కీలక నేతలను జగన్ వద్దకు తీసుకెళ్లి పార్టీలోకి చేర్చుకుంటామన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి హాలహర్వి మండలం నుంచి వేలాది మంది రావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ రామిరెడ్డి, అర్ధగేరి శ్రీనివాసులు, వీరేశప్ప, బజారప్ప, చెన్నబసప్ప, సుగన్నగౌడ్ పాల్గొన్నారు.

నేడు హొళగుందకు ఎమ్మెల్యే

హొళగుంద: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వీరుపాక్షి సోమవారం హొళగుందకు వస్తున్నట్లు మండల వైసీపీ కన్వీనర్ షఫీయుల్లా ఆదివారం తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించాలని కోరారు.

జ్ఞాపకాల సమ్మేళనం


పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చిప్పగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమ్మేళనం అంటే కేవలం ఒక సమావేశం కాదు అది జ్ఞాపకాల ఉత్సవం, బంధాల పునర్మిలనం, పాఠశాల జీవితంలోని మధుర క్షణాలను మళ్లీ స్మరించుకునే అద్భుతమైన సందర్భం అని ఉపాధ్యాయులు మల్లన్నగౌడ్, రంగన్న, ఏకంబరం, రంగనాయకులు, రాధిక, సుభాషిణి అన్నారు. చిప్పగిరి ఉన్నత పాఠశాలలో 2014-15 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. గురువుల ఆశీస్సులు, స్నేహితుల తోడ్పాటు, స్కూల్ గంటల శబ్దం, క్లాస్ రూమ్ నవ్వులు ఇవన్నీ తమ హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయాయని వారు పేర్కొన్నారు. పాఠశాలల్లో చదువుకున్న తాము వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, ప్రభుత్వాధికారులుగా స్థిరపడ్డామని ఈ విజయాల కు మూలం అయిన గురువులు గుర్తు చేసుకోవడం మన కర్తవ్యమని పూర్వ విద్యార్థులు తెలిపారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

మంత్రాలయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలోని యాగశాలలో బెంగుళూరుకు చెందిన గెజ్జినాథ నృత్య మందిర్ ఆర్గనైజర్ భువన నిఖిల్ ఆధ్వర్యంలో 130మంది కళాకారులచే నిర్వహించిన భరతనాట్యం అలరించింది. ఆదివారం యాగశాలలో సాంప్రదాయక భరతనాట్యం నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. మంత్రాలయం మండలంలోని చౌళహళ్లి గ్రామానికి చెందిన మంజునాథరెడ్డి కుమార్తె సాహిత్‌రెడ్డి నృత్యం కనువిందు చేసింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కళాకారులకు నగదు,శేషవస్త్రం,ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, ఐపీ నరసింహమూర్తి, అనంత పురాణిక్, జేపీస్వామి, పద్మనాభాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాశ్ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు, రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు భూ సమస్యలతోపాటు , ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు బాబయ్య

గోనెగండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, బాబయ్య డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ మూడు పెండింగ్ డీఏలు, సరెండర్‌లీవ్‌లు డీఏ బకాయిలు దాదాపు రూ. 20కోట్ల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం గోనెగండ్ల నూతన కార్యకవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఎస్టీయూ నూతన గౌరవ అధ్యక్షుడిగా గోపాల్‌గౌడ్, అధ్యక్షుడిగా గురుసాగర్, ప్రదానకార్యదర్శిగా రమేష్, ఆర్థిక కార్యదర్శిగా వీరాంజినేయ గౌడ్, జిల్లా కౌన్సిలర్లుగా వెంకటేశ్వర్లు, భూషన్‌గౌడ్, నరసింహులు, శివనాగిరెడ్డి, సీపీఎస్ కన్వీనర్‌గా సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా హరిబాబు, వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కృష్ణగౌడ్, మధు, ఆంజనేయలు, తోపాటు మరి కొందరిని కమిటీ సభ్యులుతా ఎన్నుకున్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేందుతున్నాయని రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. ఆదివారం గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామంలో రూ. 95లక్షలతో ఏర్పాటు చేయబోతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు మాజీ ఎంపీపీ హనుమంతు, మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, గోనెగండ్ల, హెచ్ కైరవాడి సింగిల్ విండో అధ్యక్షులు రామాంజినేయులు, తిమ్మారెడ్డి, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ ప్రభాకర్‌నాయుడు కలిసి భూమిపూజ పనులకు శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సహకారంతో గాజులదిన్నె గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర, ఉపసర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్‌లు సంజన్న, యాకోబు, రమణచౌదరి, రాజేష్, రంగస్వామినాయుడు, తెలుగు యువత నాయకులు ఐరన్‌బండబాషా, హరికృష్ణ, కాంట్రాక్టర్ చిన్ననేలటూరు నాగన్న, రాంపురం రఫీక్, రమేష్‌నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ తాలుకా నాయకులు పాల్గొన్నారు.

104ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు రాముడు

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తు ప్రజాసంజీవినిగా పేరుతెచ్చుకున్న 104ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు రాముడు, 104ఉద్యోగుల సంఘం నాయకులు పెద్దయ్య, వెంకటేష్‌లు మాట్లాడుతూ చాలీచాలనీ వేతనాలతో ఉద్యోగాలు చేసున్న సిబ్బందికి అరబిందో నుంచి రావాల్సిన బకాయిల విషయంలో అన్యాయం జరిగిందన్నారు. అరబిందో నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే పూర్తి స్థాయిలో ఉద్యోగనియమాకాలు చేపట్టి బఫర్ సిబ్బందిని ఆర్ఎఫ్‌పీ నిబంధనల ప్రకారం నియమించాలని, పనిభారాన్ని తగ్గించాలన్నారు. 104లో ఫార్మాసిస్ట్‌ను నియమించాలన్నారు. అలాగే జీఓ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు



పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమేష్ రెడ్డి

కోసిగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ డి.రమేష్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో మండలంలో ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో విభేదాలు, గొడవలు, అవాంఛనీయ సంఘటనల జోలికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ ఈశ్వరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆర్టీ ఛీ టి

- బస్టాండ్‌లో భద్రత కరువు
- పని చేయని సీసీ కెమెరాలు
- అపరిశుభ్రంగా బస్టాండ్ అవరణం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

ఎమ్మిగనూరు బస్టాండ్ అధ్వానంగా తయారైంది. బస్టాండ్ ఆవరణం చెత్తచెదారం, అపరిశుభ్రంగా మారింది. బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సీసీ కెమెరాలు ఉన్నా పని చేయడం లేదు. బస్సు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు బస్టాండ్ నుంచి బెంగూళురు, హైదరాబాద్, తిరుపతి విజయవాడ, బళ్లారి, తదితర ప్రాంతాలకు బస్సు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం వందల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు.



బస్టాండ్‌లో పని చేయని సీసీ కెమెరాలు



బస్టాండ్‌లో నిలబడి ఉన్న ప్రయాణికులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ప్రయాణికుల భద్రత కోసం సీసీ కెమెరాలు గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఆ సీసీ కెమెరాలు కొన్నేళ్ల నుంచి పని చేయడంలేదు. ఎమ్మిగనూరు డిపో నుంచి ప్రతి రోజు 85 బస్సులు తిరుగుతున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్త్రీ శక్తి పథకం మొదలు పెట్టినప్పటి నుంచి ప్రతి రోజు 10వేలకు పైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి, ఉరుకుంద ఈరన్న స్వామి ప్రముఖ ఆలయాలకు ఈ బస్టాండ్ నుంచే ప్రయాణికులు వెళ్తుంటారు. అయితే బస్టాండ్‌లో తాగునీరు కూడా కల్పించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల బళ్ళారి నుంచి వచ్చిన కొందరు మహిళలు తప్పతాగి బస్టాండు ఆవరణలో వీరంగం సృష్టించారు. బస్టాండ్ ఆవరణలోనే మూత్ర విసర్జన చేయడంతో ఆప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు సీసీ కెమెరాలు పని చేసే విధంగా చర్యలు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. సీసీ కెమెరాలు ప్రస్తుతం పని చేయడం లేదని, వాటిని మరమ్మతులు చేయిస్తాం. మినరల్ వాటర్ కోసం ఏపీ ల్యాండ్ కింద నిధులు వచ్చాయి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. -మద్దిలేటి నాయుడు, ఆర్టీసీ మెనేజర్

తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



జీపుజాతాలో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించటంతో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నాయకులు గోవిందు అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో రెండో రోజు ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి, మల్కాపురం, కోటేకల్, దేవిబెట్ట, చెన్నాపురం, బోడబండ, వెంకటగిరి, గుడికల్, కే నాగలాపురం, పార్లపల్లి, పెసలదిన్నే, కే తిమ్మాపురం, కలుగొట్ల గ్రామాల్లో జీపుజాతాను నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో జీపు జాతా ముగింపు సందర్భంగా నాయకులు గోవిందు, అబ్దుల్లా, రమేష్, నామాల రాముడులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17నెలలు గడుస్తున్న గ్రామాల్లో తాగునీటి సమస్యను తీర్చలేకపోయిందని ప్రజలు ఆరోపించారన్నారు. పాలకులు స్పందించి వెంటనే గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ



రాఘవరాయల బృందావనానికి హారతులు ఇస్తున్నపీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా నిర్వహించారు.. ఆదివారం కార్తిక పంచమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు, అర్చకులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పీఠాధిపతి పూర్ణబోధ పూజమందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. స్వామివారికి హస్తోదకం చేసి మహామంగళహారతులు ఇచ్చారు.

ఉచిత అంబులెన్స్ సేవలు



ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రజావైద్యులు డాక్టర్ మాలకొండయ్య

ఎమ్మిగనూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను ప్రజావైద్యులు డా.మాలకొండయ్య ప్రారంభించారు. ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉపాధ్యాయులు మాదన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచిత అంబులెన్స్ వాహనాన్ని డా మాలకొండయ్య ప్రారంభించారు. విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు రామాంజనేయులు, డా మాలకొండయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం అబినందనీయమన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు దావీదు, యల్లప్ప, కౌలన్న, నాగరాజు, నరసింహులు, రవి, రాజేష్, సుధాకర్, రామాంజనేయులు, రాముడు పాల్గొన్నారు.

మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా వీరేష్



వీరేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

నందవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నందవరం టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా నదీకైరవాడి వీరేష్ ఎన్నికయ్యారు. గతంలో వీరేష్ తాలుకా ఐ టీడీపీ అధ్యక్షుడిగా పని చేశాడు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. వీరేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని వమ్ము చేయనని అన్నారు. ఆదివారం వీరేష్‌ను పెద్దకొత్తిలి ఆదిశేషు, మిట్టసోమాపురం వీరేష్, తదితరులు సన్మానించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం



క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించటమే బుట్టా ఫౌండేషన్ లక్ష్యమని మాజీ ఎంపీ, వైసీపీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక, ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ అన్నారు. ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎఫ్‌సీ టీం ప్రసిడెంట్ మాబుసాబ్, కార్యదర్శి పాల శ్రీనివాసరెడ్డి, సీనియర్ క్రీడాకారులు విక్రమ్, ఈరన్న, ప్రసాద్, చేనేతమల్లి, హనీఫ్, వైసీపీ నాయకులు సునీల్ కుమార్, యుకే రాజశేఖర్, మహబూబ్ బేగ్, యూత్ అధ్యక్షులు బోయ రాజు, మండల ప్రసిడెంట్ బనవాసి బసిరెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక



మౌనేశ్

కోసిగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 ఖో-ఖో పోటీలకు వందగల్లు గ్రామానికి చెందిన మౌనేశ్ ఎంపిక కావడంపై గ్రామస్థులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు. మౌనేష్ తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువు తుండగా... జిల్లా స్థాయిలో జరిగిన ఖోఖో పోటీలో నెంబర్-1 క్రీడాకారు డుగా ఎంపికై విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు మౌనేష్ ఎంపిక కావడంపై కోసిగి మండల ప్రజలు, వందగల్లు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సిరాలదొడ్డిలో తాగునీటి సమస్య

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో సిరాలదొడ్డి గ్రామంలో పది రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదని ప్రజలు వాపోయారు. గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే బోర్లు, పైపులైన్లు, మినీ ట్యాంకులు అన్ని ఉన్నప్పటికీ నీటిని మాత్రం సరఫరా చేయడంలేదు. తాగునీటి కోసం వ్యవసాయ బావు,బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

- సీసీరోడ్డు, డ్రైనేజీ, వీధి దీపాలకు నోచుకోని చదువుల రామయ్య కాలనీ



సీసీరోడ్డుకు నోచుకొని చదువులరామయ్య కాలనీ

గోనెగండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చదువుల రామయ్య కాలనీ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కాలనీలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 35 ఏళ్ల క్రితం కమ్యూనిస్టు నాయకులతో కలిసి పోరాటం చేస్తే ప్రభుత్వం 100 గృహాలకు పట్టాలు ఇచ్చింది. ఆనాటి నుంచి నేటి వరకు ప్రతి ఇంటి(గుడిసే) నుంచి పంచాయతీకి ఇండ్ల గుత్తలు కడుతున్నారు. ఓట్లు కోసం వచ్చిన ప్రతి నాయకుడిని సమస్యలు పరిష్కరించమని కాలనీ వాసులు వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి కొళాయిలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీరోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలి

కాలనీలో సీసీరోడ్డు డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నాం. పల్లెపండుగ కార్యక్రమంలోనైనా మా కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేపడితే బాగుంటుంది. అధికారులు, నాయకులు స్పందించాలి.

• చెన్నలరాయుడు, గోనెగండ్ల



కాలనీలో గుంతలు పడిన మట్టి రోడ్డును చూపుతున్న కాలనీ వాసులు

వాటర్ ట్యాంకు శిథిలం

- కడ్డీలు తేలి పెచ్చులూడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ట్యాంకు సమీపంలోనే పాఠశాల భవనం
- ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, ప్రజలు ఆందోళన



పిల్లర్లకు పగుళ్లు వచ్చి కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం

కోసిగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు పిల్లర్లకు పగుళ్లు వచ్చి కడ్డీలు బయటకు రావడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు, సమీప పాఠశాల విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, గ్రామ సర్పంచ్ చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రధాన రోడ్డుకు పక్కనే ట్యాంకు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు సైతం జంకుతున్నారు. ట్యాంకును తొలగించి నూతన ట్యాంకును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకు